# ముఖపుస్తకంలో ముగ్ధ



సింహప్రసాద్

# ముఖపుస్తకంలో ముగ్ధ

## నవల

సింహ ప్రసాద్

**శ్రీశ్రీ ప్రచురణలు**

401, మయూరి ఎస్టేట్స్,

యం.ఐ.జి. 11/650.

కె.పి.హెచ్.బి, హైదరాబాద్ - 500 085

సెల్. 98490 61668

# Mukapustakamlo Mugdha

By Simha Prasad
e-mail : simhaprasad99@yahoo.com

© రచయిత

ప్రథమ ముద్రణ (e-book) :
జూన్ 2014

వెల : ₹100/-

ముఖచిత్రం : బాలి

డి.టి.పి. : శ్రీ భువనేశ్వరి

ప్రతులకు :

www.kinige.com

**Published by :**

**Sri Sri Prachuranalu**
401, Mayuri Estates, MIG - II/650,
Near Temple Bus stand,
KPHB, Hyderabad - 500 085.
Cell : 98490 61668

# ముఖపుస్తకంలో ముగ్ధ

**'ము**గ్ధ మీ ఫ్రెండ్ కావాలనుకొంటోంది'

ఫేస్‌బుక్ నుంచొచ్చింది మెయిల్.

ఎవరీ ముగ్ధ?

పేరు మాత్రం అదిరింది. ఫిగరూ అదురుతుందా?

మెదడు గూగుల్ పొరల్లో 'సెర్చ్' చేశాను గాని ఆ పేరెక్కడా తగల్లేదు.

మరి ఎవరై ఉంటారు? ఫ్రెండ్ ఫ్రెండేమో! బహుశా అభిగాడి ఫ్రెండయ్యుండొచ్చు. వాడు కవి అవటం కాదు గాని కవుల్నీ కవయిత్రుల్నీ మూకుమ్మడిగా చేర్చేసుకున్నాడు. అంతటితో ఆగకుండా నాకూ ఫ్రెండ్స్‌గా చేర్చేశాడు.

బహుశా ఈ ముగ్ధ ఓ కవయిత్రి అయివుంటుంది. కవులకీ రచయితలకీ ఎంత డిస్టెన్స్ మెయిన్‌టెయిన్ చేస్తే అంత ప్రశాంతంగా ఉంటాం. లేకపోతే వాళ్ళ 'స్వంత డబ్బా సౌండు'కి మెదడు వాచిపోవడం ఖాయం.

ఐఫోన్‌ని జేబులో పడేసుకుని బైక్ తీస్తోంటే 'కుయ్'మంది సెల్. కొత్త మెస్సేజ్ ఏవిటోనని చూశాను.

ముగ్ధ ఎఫ్‌బీ ఫ్రెండ్ రిక్వెస్ట్‌కి రిమైండర్!

'జిడ్డు మహాదేవిలా ఉందే' అనుకుంటూ ఆవిడ వివరాలు ఫేస్‌బుక్‌లో తిరగెయ్యబోయే 'చోడో యార్' అనుకుని వదిలేశాను.

జనానికి ఫేస్‌బుక్ పిచ్చి క్రికెట్ పిచ్చిని మించిపోయింది సుమా!

బైక్ కిక్ కొడుతుంటే సెల్ మ్రోగింది.

లైన్లో శ్రీధర్.

"బేటా స్వప్నిల్లూ. నీ కోసం బ్రాండ్ ఫ్యాక్టరీలో అరగంట నుంచి ఒంటికాలి మీద తపస్సు చేస్తున్నాం. త్వరగా ప్రత్యక్షమై మమ్మల్ని ధన్యుల్ని చేస్తావా?"

"సారీరా...దారిలో ఉన్నాను. ఫైవ్ మినిట్స్‌లో మీ ముందు వాలిపోతాను. బై..."

బైక్‌ని దూకించాను. నా కోసం నిరీక్షిస్తోన్న శ్రీధర్‌కీ రామారావుకీ హైఫైవ్ ఇచ్చి మరోసారి సారీ చెప్పేను.

"నీ కన్నా గాళ్స్‌నయం ఫాస్ట్‌గా రెడీ అవుతున్నారు..." శ్రీధర్ అన్నాడు.

"పెళ్లయ్యాక ఆ స్టేట్‌మెంటిస్తే నమ్ముతాం" నవ్వేడు రామారావు.

"నా ఉడ్ బీ వేరోయ్"

"అంతా అలాగనే నమ్ముతారు. తర్వాతది వేరు కాదు కాండం అని తెలిసేసరికి నీళ్ళు నములుతారు"

రామారావు మాటలకు, "గురూ గారు స్వానుభవంతో చెబుతున్నారు. ఓకే అని ఓటేసి లోపలి కెళ్దాం పదండి" అన్నాను.

నవ్వుకుంటూ బ్రాండ్ ఫ్యాక్టరీలోకి నడిచాం.

"ఇంత లేటయ్యిందేంరా. పొద్దుటే ఏం రాచకార్యాలొచ్చిపడ్డాయేంటి" శ్రీధర్ అడిగాడు.

"సాటర్ డే అంటే లేట్‌గా లేవటం అని ట్యూన్ అయిపోయాం..."

"ఇంకొద్ది రోజుల్లో శ్రీధర్ మొఖం మీద మారీడ్ స్టాంప్ పడబోతోంది. వాటెబువుట్ యూ? నీ మ్యారేజ్ ప్రపోజల్స్ ఎంతవరకూ వచ్చాయి?" రామారావు అడిగాడు.

"నేను త్వరగా వినాయకుడి బొడ్డులో వేలుపెడితే గాని మీకు హ్యాపీగా ఉండేట్లు లేదే"

"యస్. తేలుకుట్టి నువ్వు ఏడ్వలేక నవ్వినప్పుడే కదా మనమంతా ఒకే బోటులో ఉండేదీ!"

"బోడి జోకులాపి ముందు నాకెలాటి బ్లేజర్ బావుంటుందో సెలక్ట్ చెయ్యండి. ఒరే స్వప్నిల్ – నీ సెలక్షన్ అమోఘం అంటావుగా చూపించు నీ ప్రతాపం"

ముగ్గురం సెలక్షన్లో పడ్డాం. వచ్చేవారం శ్రీధర్ పెళ్లికి తాంబూలాలు తీసుకోనున్నారు. అప్పుడు చక్కని బ్లేజర్లో మెరిసిపోయి ఆడపెళ్లి వారిచేత 'వావ్' అన్పించుకోవాలని మా వాడి తపన.

కొన్ని షార్ట్ లిస్ట్ చేసి తర్జన భర్జనలు పడుతోంటే సెల్ 'కుయ్' మంది.

మెస్సేజ్ ఎక్కడ్నుంచోనని చూద్దును గదా మళ్ళీ ముగ్ధని ఫేస్‌బుక్ ఫ్రెండ్‌గా చేర్చుకోవడం గురించే.

"ఇదెక్కడి గోలరా బాబూ" సెల్ కట్టేస్తూ పైకే అనేశాను.

"గాళ్‌ఫ్రెండా?" వాసన పసిగట్టేశాడు రామారావు.

"వూహూ. ఎవరో అమ్మాయి. ఫ్రెండ్‌గా చేర్చుకోమని ఒకటే రిక్వెస్టులూ రిమైండ్లూ!"

"ఫేస్‌బుక్ హెల్ప్స్ యు కనెక్ట్ అండ్ షేర్ విత్ ఆల్ టైప్సాఫ్ పీపుల్ ఇన్ యువర్ లైఫ్" రామారావు నవ్వేడు.

"సో. స్టే కనెక్టెట్ విత్ గాళ్స్" కన్నుగీటాడు శ్రీధర్.

"ఒరె ఒరె – అంత స్పీడొద్దు. ఇక్కడ మ్యాటరేం లేదు..."

"ఆమె ఎవరో నీకు నిజంగా తెలీదా?" నా శీలాన్ని శంకించాడు శ్రీధర్.

"గాడ్ ప్రామిస్‌రా. తెలీనే తెలీదు"

"అనామిక అన్నమాట. అయితే లోతుగా ఆలోచించాల్సిందే" గంభీరంగా మొహం పెట్టాడు రామారావు.

"అనామిక కాదు ముగ్ధ..."

"ఐసీ. నిన్ను ముగ్ధుడ్ని చెయ్యడానికి ప్రయత్నిస్తోందన్న మాట. ఆలస్యం ఎందుకూ. గో ఎహెడ్" అన్నాడు శ్రీధర్.

"ముక్కూ మొహం తెలీకుండా..."

"అవి ప్రొఫైల్‌లో ఉంటాయి..."

రామారావు వంక మిర్రి చూశాను.

ఇద్దరూ ఒక్కసారే భళ్ళున నవ్వేరు. "నీ నాటకాలు మా దగ్గర కాదు గాని ఆల్ ద బెస్ట్ స్వప్నిల్. నీ స్వప్న సుందరి లభించేసినట్టే. త్వరగా బ్యాచిలర్స్ పార్టీ ఇచ్చెయ్"

శ్రీధర్ వంక ఎంబ్రాస్సింగా చూశాను. "నిజంగానే మేటరేం లేదు. ఉంటే పార్టీ ఇచ్చి మరీ చెప్పనా?"

"అఫ్‌కోర్స్. ఓకే కేరీ ఆన్. బట్ బీ కేర్ ఫుల్. ఆ అమ్మాయి చాలా ఫాస్ట్‌గా ఉంది" అని శ్రీధర్ అంటే, "బీ కాషస్ బివేరాఫ్ గాళ్స్!" అన్నాడు రామారావు.

"మీ ఉచిత సలహాలకి థాంక్స్. ఇదంత దూరం వెళ్ళదు. నా జాతకంలో అరేంజ్డ్ మ్యారేజే ఉంది..."

"అందుకేనా వారానికో పెళ్లి చూపులకు చెక్కేస్తున్నావ్"

"నా సంగతి ప్రక్కన పెట్టి బ్లేజర్ సంగతి తేల్చండి"

"తేల్చాల్సింది శ్రీధరే. ఒకటి తర్వాత ఒకటి వేసుకుని చూడరా. అన్నీ ఫొటో తీద్దాం. ఏది నీకు యమగా నచ్చితే అది ఓకే చేసేద్దాం"

రామారావు మాటల్తో ఏకీభవించాం.

శ్రీధర్ ఒక్కో బ్లేజర్నీ ధరిస్తోంటే సెల్‌తో చకచకా ఫొటోల్తీశాను.

కలరూ కంఫర్టూ స్టైలూ దృష్టిలో పెట్టుకుని ఒకదాన్ని ఫైనలైజ్ చేశాం. బిల్ పే చేసి బయటి కొచ్చేసరికి కడుపులో రాట్స్ మాంచి ఊపుతో 'రన్స్' చేస్తున్నాయి.

"నిజామ్స్ కిచెన్ కెళదాం" శ్రీధర్ ప్రపోజ్ చేశాడు.

"ఇప్పటికి ఓకే. పెళ్లికి మాత్రం తీర్థప్రసాదాలు గ్రాండ్‌గా అరేంజ్ చెయ్యాలి. వోడ్కా దొరుకుద్దేమో ట్రై చెయ్యరా శ్రీధర్. ఎప్పట్నుంచో టేస్ట్ చేయాలని ఉవ్విళ్ళూరిపోతున్నాను"

"మన వాళ్ళకి స్పెషల్ ట్రీట్ ఉంటుందిలే గాని తాగి గొడవచెయ్యకూడదు మరి, పరువు పోద్ది"

"ఛా ఛా . మేం జస్ట్ టేస్ట్ గాళ్ళం గాని తాగుబోతులం కాదు" గొప్పగా చెప్పేను.

"నాయనా స్వప్నిల్. తాగే దాకానే మనం మనంగా ఉంటాం. ఆ తర్వాత మందు చేతిలో బందీయై పోతాం"

కోక్ తాగుతూ దమ్ బిర్యానీ లాగిస్తున్నాం. మాకొద్ది దూరంలో నలుగురు యువతులు కూర్చునున్నారు. ముగ్గురూ అదే పనిగా వాగుతోంటే ఒకామె సెల్‌తో కుస్తీపడుతోంది.

ఆమె సన్నగా ఉంది. చక్కగా ఉంది. తీరైన మొఖంతో సూదంటు రాయి కళ్ళతో మోడ్రన్ దుస్తుల్లో మెరిసిపోతోంది.

సరిగ్గా అప్పుడు నా సెల్ 'కుయ్'మంది.

క్షణకాలం నాగుండె లయ తప్పింది.

చటుక్కున మెయిల్ చూశాను. మళ్ళీ రిమైండర్. ముగ్ధ గురించే.

కొంపతీసి ఈ అమ్మాయే ముగ్ధేమో?

నా బ్లడ్ వెస్సెల్స్‌లో రక్తం రన్నింగ్ రేస్ చేస్తోంది. మొహం కించిత్తు ఎర్రబడింది. సిగ్గుగా చూశాను. దొంగ చూపులు చూశాను. అయినా శ్రీధర్‌కి దొరికిపోయాను.

"నీ లక్కీ మాస్కెట్టా?" కళ్ళెగరేశాడు.

'ఆ..అహహ....."

"సెలక్షన్ అదిరింది" రామారావన్నాడు ఆ అమ్మాయిని ఆసాంతం చూసి తలాడిస్తూ.

"ఒరె ఒరె బ్రేకులెయ్యరా బాబూ. ఆ అమ్మాయెవరో నాకు నిఝంగా తెలీదు"

"ఇప్పుడు తెలుసుకో. ఆమె గుండెకి నో వేకెన్సీ బోర్డుందేమో కనుక్కోనా?"

"షటప్"

"ఓకే. ఇతరుల లవ్ ఎఫైర్లో వేలు పెట్టిన వాడు గాడిద"

శ్రీధర్ కామెంటుకి సరదాగా నవ్వుకున్నాం.

"ఇంకా ఎన్నాళ్ళని ఊహల్లో ఊరేగుతావు గానీ త్వరగా ఎవరొకరికి తగులుకోరా స్వప్నిల్" సలహా ఇచ్చాడు రామారావు.

వాళ్ళెళ్ళి పోయాక తిరిగి రెస్టారెంట్లో కెళ్ళాను. 'వర్కవుట్' అవుద్దేమోనన్న ఆశతో తిన్నగా ఆ అమ్మాయి దగ్గరి కెళ్ళాను. కంగారు పడింది.

"మిమ్మల్నెక్కడో చూసినట్టుంది. మీ పేరు మిస్?" ముగ్ధ అంటుందని చెవులు రిక్కించాను.

"నా పేరు విని ఉండరు. నన్నే చూసుంటారు"

పెదవి కొరుక్కుంటూ, "అలాగంటారా. ఎప్పుడు ఎక్కడ చూశానంటారు?" అడిగాను.

"జస్ట్ చూడటమే కాదు డాన్సూ చేశారు"

"ని.. నిజమా?"

"యా"

"ఎ..ఎక్కడ?"

"మీ డ్రీమ్‌లో"

ఘొల్లున నవ్వారామె ఫ్రెండ్స్.

మరుక్షణం సీన్లోంచి అదృశ్యమై పోయాను!

## ౨

**రూం** కెళ్తూనే సిగరెట్ వెలిగించాను. రెండు దమ్ములు లాగించి ఐపాడ్ అందుకుని ఫేస్‌బుక్ ఎక్కౌంట్లో కెళ్ళాను.

ముగ్ధ ప్రొఫైల్ తిరగేసినవాడ్నల్లా హతాశుడ్నయ్యాను.

నాలుగేళ్ళ అమ్మాయి ఫొటో నవ్వుతోంది!

వివరాల్లో కెళ్తే – విశ్వభారతి హైస్కూల్... కోనేరు లక్ష్మయ్య ఇంజినీరింగ్ కాలేజి... టీసియస్‌లో జాబ్...

వాటిలో వేటితోనూ నాకు సంబంధం లేదు. సో. నాకు సీనియర్ గాని జూనియర్ గాని అయ్యే అవకాశమే లేదు.

హాబీలు... బుక్ రీడింగ్, సినిమాలు!

సినిమాలంటే ఇష్టపడని యూత్ ఉండరు. సినిమా రిలీజవడం ఆలస్యం అమాంతం రివ్యూల మీదా రేటింగ్ మీదా పడేది యూత్తే.

ఆమె రిలేషన్ స్టేటస్ చెక్ చేశాను. సింగిలే. మనస్సు కొంచెంగా మెత్తబడింది.

'ఫ్రెండ్ రిక్వెస్ట్'ని యాక్సెప్ట్ చేసెయ్యనా?

అంత అందమైన పేరున్న అమ్మాయి పదే పదే అభ్యర్థిస్తోంటే మీన మేషాలు లెక్కపెడుతూ దిక్కులు చూడటం దారుణమైన నేరం!

'ఏమైతే అవ్వనీ' అనుకుంటూ 'యాక్సెప్ట్' నొక్కాను.

ఉత్తర క్షణాన పెర్సనల్ మెస్సేజ్ వచ్చేసింది.

"థాంక్యూ థాంక్యూ వెరీమచ్. ఈ అదృష్టం కోసం ఎదురు చూస్తోంటే నా కళ్ళు ఏకంగా కాయలు కాసేశాయి. నిఝం. నేనిప్పుడు ది గ్రేట్ స్వప్నిల్ గారి ఫ్రెండ్ని. ఎవరెస్టు ఎక్కినంత సంబరంగా ఉంది. థాంక్యూ థాంక్యూ...!"

"నేను మీకు తెలుసా?" రిప్లై పంపేను.

"ఓ చాలా బాగా... మీ ఒంటిమీది పుట్టు మచ్చలు తప్ప మీ గురించంతా అంతా తెలుసు. డౌటుంటే ఓ క్వశ్చన్ సంధించి చూడండి. ఛాట్‌కి రాకూడదూ బోల్డు కబుర్లూ కాకరకాయలూ కట్ చేసుకోవచ్చు..."

టెంప్ట్ అయ్యాను.

"మీతో ఇలా ముఖాముఖీ అవకాశం ఇంత వేగంగా వస్తుందని స్వప్నించ లేదు..."

"ఇంతకీ మీరు..."

"ముగ్ధని..."

"అడ్రసే... మీరెవరో తెలుసుకోవాలని ఆత్రంగా ఉంది"

'స్మైలీ' పంపింది. తెలివైందనుకుంటూ నవ్వుకున్నాను.

"స్వప్నిల్ ఫ్రెండ్ని. చాలదా? ముద్దొచ్చేలా ఉంటాను. సరిపోతుందా?"

"మీరు బావుంటారని ఊహించాను... నేను మిమ్మల్ని చూశానా?"

"యస్...గత జన్మలో. అప్పుడు నేను రాకుమారిని. మీరు నాకోసం అందర్నీ ఓడించిన వీరాధివీరుడు"

"నాకా స్మృతుల్లేవు. ఈ జన్మ సంగతి చెప్పకూడదూ?"

"చెప్పొచ్చు. బొత్తిగా ముడి విప్పేస్తే ఏం బావుంటుందీ!"

"ఎట్లీస్ట్ ఒన్ ఆర్ టూ క్లూస్...?"

"డామ్ ఇన్సల్ట్. మీరెంతో గ్రేట్ అని ఆరాధిస్తోంటే మీరలా నేలబారు ప్రశ్నవేయడం... డైజెస్ట్ చేసుకోలేకపోతున్నా"

"ఓకే ఓకే. నేనే కనుక్కుంటా"

"అదీ స్పిరిట్. గుర్తుంచుకోండి. నేను సముద్రం మీద వెన్నెల్లో ఆడుకునే ఆడ పిల్లని"

"యండమూరి వెన్నెల్లో ఆడపిల్ల కాకూడదు"

"నో ఛాన్స్. నా సీన్లు వేరు నా రోల్ వేరు"

"మీ ఫొటో పంపకూడదూ? జస్ట్ క్యూరియాసిటీ సేక్..."

"ఓకే. సెల్ నెంబరివ్వండి వాట్స్‌యాప్‌లో ఇప్పుడే పంపేస్తా"

ఇచ్చాను.

"థ్యాంక్యూ. బై..."

చటుక్కున ఐ ఫోన్లోని వాట్స్‌యాప్ కెళ్ళాను. ఫొటో రాలేదు.

మళ్ళీ మళ్ళీ మళ్ళీ మళ్ళీ – వందో మళ్ళీ చూశాను రాలేదు.

ముగ్ధ తన ఫొటో ఎందుకు పంపలేదు?

ఆమె వెనుక మిస్టరీ ఏమీ లేదు కదా? తొందరపడి ఆమె 'నెట్'లో పడిపోలేదు కదా?

ఒళ్ళు జలదరించింది.

ఇట్సాల్ నాన్సెన్స్!

మళ్ళీ ఫేస్‌బుక్‌లో కెళ్ళి అప్‌డేట్స్ చూశాను.

ముగ్ధ వాల్ మీద ఏదో రాసింది.

స్టార్ హాస్పటల్లోని ఓ హృద్రోగికి బి నెగిటివ్ బ్లడ్ అర్జంటుగా కావాల్ట. ఆ రక్తం ఉన్న వాళ్ళెవరైనా రక్తదానం చెయ్యమంటూ విజ్ఞప్తి చేసింది.

ఈమె ఇలాటి పనికి మాలిన కార్యక్రమాలూ చేసి జనాన్ని ఉద్ధరిస్తోందన్న మాట!

నాది ఆ రక్తమే. ఆ సంగతి చెబితే 'బీ పాజిటివ్ అండ్ డొనేట్ నౌ' అంటూ వెంట బడుతుందేమో!

రకరకాల ఆలోచనలు బుర్ర తినేస్తున్నాయి.

బైక్ తీసి సిటీ మీద పడ్డాను. ఐస్‌క్రీం సగమే తినగలిగాను. రెస్టారెంట్ కెళ్ళ బుద్ధి కాలేదు. మంజీరా మాల్ కెళ్ళాను. శృతిహాసన్ ఆకర్షించింది.రేసుగుర్రంకి టిక్కెట్ కొన్నాను. ఒంటరిగా ఆ సినిమా చూడటం ఏమిటిన్పించి దిక్కులు చూస్తూ నిలబడ్డాను.

ఎవరో నవ్విన శబ్దం విన్పించింది.

చుట్టూ కలయజూశాను. ఎందరో ఆడా మగా రకరకాల వయస్సుల వాళ్ళు ఎన్నో రకాల ఫ్యాషన్ దుస్తుల్లో ఒంటరిగా జంటలుగా గుంపులుగా...!

పెదవి కొరుక్కున్నాను.

నో డౌట్. ముగ్ధ హాంట్ చేస్తోంది!

ఆమె పేరు 'విని' కొన్ని గంటలే అయ్యింది. ఇంతలో అంతగా ఎట్రాక్టవడం... అది ఎట్రాక్షనా లేక...?!

జానేదేవ్. మనిషిని చూడకుండా మైకంలో పడటం అబ్సర్డ్. చైల్డిష్...!

సెల్ మ్రోగింది. ఆన్ చేస్తూనే, "ఫొటో పంపలేదేం?" అడిగేశాను.

"నిన్ననే పంపేను కదుట్రా..."

లైన్లో డాడీ. మైగాడ్. ముగ్ధ అనుకుని... ఇంకా నయం. పేరు పెట్టి పిలిచి ఉంటే అడ్డంగా దొరికిపోయేవాడ్ని!

"ఆల్రెడీ పంపేశారా. సరే సరే. ఇంటికెళ్ళగానే చూస్తాను డాడీ..."

"ఇప్పుడెక్కడ షికార్లు కొడుతున్నావేంటి?"

"ఫ్రెండ్స్‌తో మూవీ కొచ్చాను....."

"ఊరికే డబ్బు తగలెయ్యకు. నా కన్నా ఎక్కువ సంపాదిస్తే చాలదు ఎక్కువ సేవ్ చెయ్యాలి. మన వీధిలో ఓ ఇండిపెండెంట్ హౌస్ అమ్మకాని కొచ్చింది..."

"తర్వాత మాట్లాడదాం డాడీ..." అసహనంగా అన్నాను.

"మీ అమ్మ ఏదో చెబుతుందిట..."

నుదురు కొట్టుకున్నాను. అమ్మ లైన్లో కొచ్చింది. "ఆ భీమవరం అమ్మాయి ఫొటో చూసి ఫోన్ చెయ్యిరా. నీకు నచ్చి తీరుతుంది. లక్షణంగా ఉందిరా అబ్బాయ్. యాభైలక్షల దాకా ముట్టజెబుతారు. మనం కొంచెం బెట్టు చేస్తే ఇంకో పది దాకా ఇస్తారు. నాకూ మీ డాడీకీ బాగా నచ్చింది. నువ్వు వూ అంటే మే నెలలో ముహుర్తాలు పెట్టేసుకోవచ్చు. పెళ్లి కూడా ఆనంద్ హొటల్లో చేస్తామంటున్నార్రా....."

“ఓకే ఓకే. ముందు నన్ను ఫొటో చూడనీ తర్వాత అమ్మాయిని చూడనీ ఆపైన నాకు నచ్చనీ...”

“నీకెందుకు నచ్చదురా. నీ ఇష్టా ఇష్టాలేంటో కన్న తల్లిని నాకు తెలీదూ. చిదిమి దీపం పెట్టుకోవచ్చురా అబ్బాయ్...”

“కరెంటు కనెక్షన్ తీసేద్దాం. సరేనా?”

“ఉన్నమాటంటే కోప్పడతావేంరా. అసలివాళ నీకేవయ్యింది?!”

“సినిమాహాల్లో ఉన్నానమ్మా...”

“మాటలేం విన్పించట్లేదు?”

“బయటికొచ్చాన్లే... రేపు మార్నింగే ఫోన్ చేస్తాను. బై మమ్మీ...”

లైన్ కట్ చేసి నుదుటికి పట్టిన చెమటలు తుడుచుకున్నాను.

మమ్మీడాడీలు పంపిన అమ్మాయి ఫొటో చూశాను. కుందనపు బొమ్మలా ఉంది. అయినా ఏదో అసంతృప్తి!

మమ్మీడాడీల ఒత్తిడి భరించలేక పెళ్లి చూపులకెళ్ళాను. లక్ష్మీదేవిలా ఉంది. సంప్రదాయ బద్ధంగా సతీ సావిత్రి సిస్టర్లా ఉంది.

‘ఆమెని చేసుకున్న వాడు లక్కీ’ అంటారెవరైనా సరే.

నేనూ అనే వాడ్నే – ముగ్ధ నా బుర్ర తొలచకుండా ఉండి ఉంటే!

ఆమెతో ప్రత్యేకంగా మాట్లాడటానికి డాబా మీది కెళ్ళాను.

“మీరేమైనా అడగాల్సుంటే అడగండి. నేనేమీ అడగక్కర్లేదు. నాకు మీ గురించంతా తెలుసు మీ పుట్టుమచ్చలు తప్ప!”

మిచ్యువస్‌గా నవ్వింది. అదిరిపడ్డాను. అర్థోక్తిగా చూశాను.

“మీరు... నువ్వు.....”

“మీరింత ట్యూబ్‌లైట్ అనుకోలేదు” వజ్రాలు జారిపడినట్టు నవ్వింది,

“మైగాడ్! నువ్వు ముగ్ధవి... గాడ్డీజ్ గ్రేట్! కోరుకున్న వరం లభించింది. అందుతుందో లేదో అనుకున్న స్వర్గం ఒళ్ళోకొచ్చి వాలింది! థాంక్ గాడ్... థాంక్ గాడ్...” ఆనందో ద్వేగంతో ఊగిపోతూ ఆమె సన్నని నడుం చుట్టూ చేయివేసి పొదవి పట్టుకుని హత్తుకుంటూ డాన్సేస్తూ.....!

దభీమని మంచం మీంచి పడ్డాక గాని తెలీలేదు అది కల అని!

ఎంత అందమైన కల! ఎంత కమ్మగా ఉంది!

ఆ కల నిజమైతే? ఎందుక్కాకూడదు?

దేవుడి ఫొటో వంక తిరిగి దణ్ణం పెట్టుకుని లెంపలేసుకున్నాను.

* * *

హైదరాబాద్ సెంట్రల్‌లో ఫ్రెండ్‌కోసం అసహనంగా ఎదురుచూస్తోంటే ఓ కండల వీరుడి బైక్ దిగింది విద్యుల్లత.

పేరులానే మెరుపుతీగలా మెరిసిపోతోంది. టైట్ జీన్స్ ఫాంటు డిజైనర్స్ స్లీవ్‌లెస్ టీ ధరించి కత్తిలా ఉంది. ఒంపు సొంపులు ప్రస్ఫుటంగా కన్పిస్తోంటే బ్లాక్ గాగుల్స్‌తో మన్మథ బాణంలా ఉంది. సూటిగా గుండెల్లో గుచ్చుకొంటోంది.

ఆమె 'కొలతలకు' మతిపోతోంటే కళ్ళప్పగించాను - సభ్యతకాదని తెలిసీ!

ఆమె నన్ను చూసి నా వైపు వచ్చింది. పలకరింపుగా నవ్వాను.

అతగాడు బైక్ పార్క్ చెయ్యడానిక్కాబోలు వెళ్ళాడు.

ఆమె ఇంజినీరింగ్ కాలేజ్‌లో నాకన్నా ఒన్ ఇయర్ జూనియర్. కానామె స్నేహాలన్నీ సీనియర్స్‌తోనే. అదీ బాయస్‌తోనే. ఆమెకి గాళ్స్‌లో ఒక్కరంటే ఒక్క ఫ్రెండ్ లేదు. ఎప్పుడూ బాయస్‌తోనే ఉండేది. బాయస్ మధ్యే ఉండేది. 'ఆమెకెందరు ఫాలోవర్సో' అని విస్తుబోయే వాళ్ళు అమ్మాయిలు!

"హాయ్! ఏవిటింకా ఒన్ - నేనొక్కడివే అంటున్నావ్? గాళ్‌ఫ్రెండ్ లేదా? ఇన్సల్ట్ టు అవర్ ఎఫ్‌బీ జనరేషన్!"

"ఉందిలే..."

"నేన్నమ్మను. ఉంటే ఇలా కొంగజపం ఎందుకు చేస్తావు?"

"చేపకోసం కాదులే. ఇవాళ రేపు గాళ్‌ఫ్రెండ్ మేకప్ ఖర్చు భరించడం చాలా కష్టమైపోయింది" ఆమె అతి మేకప్ నుద్దేశించి అన్నాను.

"అవునవును గాని మేకప్‌లేని గాళ్‌ఫ్రెండ్‌ని భరించడం ఇంకా కష్టమేమో?" నవ్వు బిగబడ్తూ అంది.

"మాటలు బాగా నేర్చావు గాని ఆ బైకు వీరుడెవడు? హాబ్బీయా?"

"ప్చ్... హబ్బీ స్టఫ్ కాదు. జస్ట్ బాయ్ ఫ్రెండ్..."

"షాపింగుకి లాక్కొచ్చావా?" నవ్వుతూ అడిగాను.

"బాయ్‌ఫ్రెండ్ అంటే బయ్ చేసే ఫ్రెండ్... అమ్మాయిల అవసరాలు తీర్చేవాడనే కదా అర్థం" చిత్రంగా నవ్వింది.

"అతగాడి క్రెడిట్ కార్డ్ లిమిట్ ఎంతో కనుక్కున్నావా?"

"మన జాగ్రత్తలో మనం ఉండకపోతే ఎలా బాసూ. రిస్కు తీసుకోలేం కదా. టూ లాక్స్. బై. గురుడు వెయిట్ చేస్తూంటాడు..."

వెళ్తోన్న ఆమెనే చూస్తూ 'కాలం మారిపోయింది సుమా' అనుకోకుండా ఉండలేక పోయాను.

ముగ్ధ కూడా ఇలా ఒళ్ళంతా 'మాగ్నెట్లతో' ఉంటే బావుణ్ణు.

ఎలాగైనా సరే ముగ్ధని చూడాలి! కలవాలి!!

## 3

"స్వప్నీ! ఎక్కడున్నావురా?" అభి కాల్ చేశాడు.

"ఇంకెక్కడుంటాను? ఆఫీసులోనే. నువ్వింకా లాంగ్ వీకెండ్ హ్యాంగోవర్ నుంచి బయటపడినట్టు లేవు. ఇవాళ మండేరా అభీ..."

"తెలుసులేవోయ్. ఈవెనింగ్ సిక్స్‌థర్టీకి ఇనార్బిట్ మాల్‌కి రా. సమ్‌థింగ్ ఎక్సైటింగ్ థింగ్ చూపిస్తాను"

"వాడ్యూ మీన్?"

"ఐ మీన్ వాటై సెడ్. నువ్వు థ్రిల్లవడం ఖాయం. నా లవ్ ఊర్వశిని పరిచయం చేస్తాన్రా" ఉద్విగ్నుడై చెప్పాడు.

"నీ గాళ్‌ఫ్రెండ్ సింధు కదా?"

"థాంక్స్, గుర్తు పెట్టుకున్నందుకు. అసలు పేరు అదే. నాకు మాత్రం ఊర్వశి. దేవులపల్లి వారి ఊర్వశి. శ్రీశ్రీ గారి కవితా ఓ కవితా!"

"బావుంది. మీరిద్దరూ బాగా అర్థం చేసుకున్నాక పెళ్లికిద్దరూ రెడీ అనుకున్నాక పరిచయం చేద్దువుగాన్లే"

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Mukhapustakamlo+Mugdha**

* * *